

బాసరలో ఉద్రిక్తత
ఏబీవీపీ ట్రిపుల్ ఐటీ ముట్టడి పిలుపుతో బాసరలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. బాసర వైపు వెళ్లే ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



మహా శాంతియాగం
జిల్లాకేంద్రంలో శ్రీవైష్ణవ ఆయుతచండీ అతిరుద్ర మహాయాగం వైభవంగా కొనసాగుతోంది. శనివారం మహాయాగం నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.3 / 15.5

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. అర్ధరాత్రి నుంచి మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాసరలో మంత్రి 'పొంగులేటి' పూజలు



మంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో విజయ రామారావు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వేద పండితులు మంత్రికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభం స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, ఈవో విజయరామారావు మంత్రిని సన్మానించి అమ్మవారి చిత్రపటం అందజేశారు. అనంతరం వైదిక బృందం అమ్మవారి ఆలయ ప్రత్యేకతను వివరించింది. అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవన్‌చంద్ర, ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ బాసర మండల అధ్యక్షుడు మమ్మాయి రమేశ్ ఉన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన..!



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండల కేంద్రానికి చెందిన వరాల గోవర్ధన్ అంగవైకల్యంతో బాధపడుతున్నా పింఛన్ రాకపోవడంతో ఇటీవల సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. గతంలో పింఛన్ ఇప్పించాలని కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. 80% వైకల్యం ఉందని సదరం ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. తర్వాత పింఛన్ ఇవ్వడం లేదని సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో గోవర్ధన్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. డీపీఎం శోభారాణి, ఎంపీడీవో లింబాద్రి సర్టిఫికెట్లు పరిశీలించారు.

రేపటి ప్రజావాణి రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో సోమవారం(ఈ నెల 18న) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–3 పరీక్షలు, సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది గ్రూప్–3 పరీక్షల నిర్వహణ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధుల్లో ఉన్నందున అధికారులెవరూ అందుబాటులో ఉండరని తెలిపారు.

కడెంలో ఉపాధిహామీ ప్రజావేదిక

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ 15వ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఆర్డీవో విజయలక్ష్మి ఆయా గ్రామాల సామాజిక తనిఖీ నివేదికలను పరిశీలించారు. రూ.15 వేలు ఉపాధిహామీ సిబ్బందిపై రికవరీ చేయాలని ఆదేశించారు. పీఆర్ సీసీ రోడ్లకు సంబంధించిన రూ.4.95 లక్షల రికార్డులు తనిఖీ బృందానికి ఇవ్వలేదని, జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణం, మొక్కల పెంపకం, పశువుల, గోట్, పౌల్ట్రీ షెడ్స్ నిర్మాణాలు బాగున్నాయని డీఆర్డీవో అభినందించారు. సమావేశంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, డీవీవో లక్ష్మయ్య, అంబుడ్స్‌మన్ నవీన్, ఎంపీడీవోలు అరుణ, వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ సిబ్బంది ఉన్నారు.

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎల్‌డీఎం

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న డాటా ప్రో శిక్షణ కేంద్రాన్ని శనివారం నిర్మల్ ఎల్‌డీఎం రాంగోపాల్ సందర్శించారు. ఈసందర్భంగా విశ్వకర్మ పథకం కింద శిక్షణ పొందిన పలువురికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా అందించే శిక్షణను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దక్కన్ గ్రామీణ బ్యాంక్ పట్టణశాఖ మేనేజర్ కె.రవీందర్, మామడ సీఎఫ్ఎల్ బ్యాంక్ అధికారి రామ్‌కిశోర్, మెప్మా సిబ్బంది రవీందర్, స్రవంతి, కేంద్రం నిర్వాహకుడు లాండేరి రవి తదితరులున్నారు.

జానీ.. ఫాలోవర్స్

నిర్మల్: ఐ వాన్న ఫాలో.. ఫాలో.. ఫాలో యూ.. ఐ వాన్న ఫాలో.. ఫాలో యూ.. అంటూ జిల్లా అడవిలోకి వచ్చిన అతిథిని ఫారెస్ట్ అధికారులు ఫాలో అవుతున్నారు. తమ పరిధి నుంచి అతిథి సురక్షితంగా వెళ్లేలా పగలు, రాత్రి తేడా లేకుండా పర్యవేక్షిస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది మొత్తం శ్రమిస్తున్నారు. పులికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకుంటున్నారు. కవ్వాల్ అభయారణ్యం వెళ్లే క్రమంలో బెబ్బులి.. ప్రస్తుతం జిల్లా సరిహద్దులో మకాం వేసింది.



అడవిలో పులిని అనుసరిస్తూ వెళ్తున్న జిల్లా అటవీ అధికారులు

రాత్రి 11గంటలు..
'సార్.. సార్.. మా ఊర్లో గుట్టదగ్గరి చేన్లకు పెద్దపులి అచ్చిందట సార్..' అని ఫోన్ రాగానే, ఆ రాత్రిపూట చలిలోనే చలో అంటూ.. ఆ ప్రాంతానికి చేరుకున్నారు. తమకు అతి సమీపంలోనే పులి ఉన్నా.. భయపడకుండా తమ విధి నిర్వహణే లక్ష్యంగా నిలిచారు. స్థానికులెవరూ దాని వైపు వెళ్లకుండా రాత్రంతా గస్తీ తిరిగారు. సమీప గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చారు.

తెల్లవారు జామున 3 గంటలకు..
'సార్.. మా చేనులో కట్టేసిన ఎద్దును పులి చంపేసింది.. పులి ఇక్కడే అడవిలో ఉన్నట్లు ఉంది' అని తెల్లవారు జామున ఫోన్ రాగానే హుటా హుటిన గ్రామానికి చేరుకున్నారు. చనిపోయిన ఎద్దును పరిశీలించి గ్రామస్తులను అలర్ట్ చేశారు.

- ఏక్‌థా టైగర్.. టీమ్ ఫారెస్ట్
- అలుపెరుగకుండా తిరుగుతూ..
- పగలు, రాత్రి విధి నిర్వహణలో..
- ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. పులికి క్లియర్ చేస్తూ..

రాణి కోసం వచ్చిన జానీ..
తిప్పేశ్వర్ అభయారణ్యంలో పులుల సంఖ్య పెరగడంతో మహారాష్ట్ర ప్రాంతం నుంచి అప్పుడప్పుడు పులులు జిల్లా అడవుల్లోకి వస్తున్నాయి. ఇదే క్రమంలో అక్టోబర్ 25న కిన్వట్–బోథ్ మీదుగా జిల్లాలోని సారంగపూర్ మండలం అడెల్లి ప్రాంతంలోకి వచ్చింది. అక్కడి నుంచి కుంటాల, అప్పారావుపేట్, దిలావర్‌పూర్, నర్సాపూర్, మళ్లీ సారంగపూర్, మామడ, పెంబి, ఖానాపూర్ మండలాల మీదుగా ప్రస్తుతం కడెం పరిధిలోని గంగాపూర్ ఏరియాకు చేరుకున్నట్లు సమాచారం. తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన ఈ పెద్దపులికి అక్కడ జానీ అని పేరుపెట్టినట్లు సమాచారం. పులులకు అక్టోబర్ నుంచి జనవరి వరకు మేటింగ్ సీజన్ కావడంతో ఆడపులి కోసం అన్వేషిస్తూ జానీ అడవంతా తిరుగుతోంది. అలా.. వేరే పులి ఇటువైపు రాకుండా తన గుర్తులను వదులుతూ ఇలాఖానూ ఫిక్స్ చేసుకుంటూ వెళ్తోంది.



రోడ్డు దాటుతున్న జానీ(ఫైల్)

అంతా అడవుల్లోనే..
జిల్లాకు వచ్చింది ఒక్కటే పులి. కానీ.. దాన్ని కాపాడుకునేందుకు జిల్లా అటవీశాఖ మొత్తం తీవ్రంగా శ్రమిస్తోంది. శాఖాధికారులు, సిబ్బంది అంతా ఓ టీమ్‌లాగా పనిచేస్తోంది. పులి ఎక్కడికి వెళ్తే అక్కడ.. రేంజ్, సెక్షన్, బీట్ అధికారులు 24 గంటలపాటు అలర్ట్‌గా ఉంటున్నారు. సీసీఎఫ్, డీఎఫ్‌వో మొదలు క్షేత్రస్థాయి వాచర్ల వరకూ స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ.. ఒకే టీమ్‌లాగా 'సేవ్ టైగర్..' అంటూ పనిచేస్తున్నారు. గతంలోనూ పలుమార్లు పెద్దపులి జిల్లాకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ.. రెండుమూడు సార్లు అవి తిరిగి వెళ్లలేదు. ఇక్కడే స్మగ్లర్ల చేతిలో, కరెంటు తీగలకు బలైపోయాయి. ఈసారి అలా కాకుండా పక్కాగా పర్యవేక్షిస్తున్నారు.

గత అనుభవాలతో..



మా భైంసా రేంజ్ పరిధిలో పెద్దపులి దాదాపు ఆరురోజులు సంచరించింది. గతంలో కాగజ్‌నగర్ ఏరియాలో పనిచేసినప్పుడు పులుల రక్షణకు తీసుకున్న చర్యల అనుభవాలు, జిల్లా అధికారుల సూచనలతో ముందుకు వెళ్లాం. టైగర్‌ను సేఫ్‌గా రేంజ్ దాటించాం.

–వేణుగోపాల్‌సట్ల, ఎఫ్ఆర్‌వో, భైంసా

రెండుపనులు చేసుకుంటూ..



పెద్దపులి కుంటాల సెక్షన్ పరిధిలోనే ఎక్కువగా సంచరించింది. పులి వచ్చిన విషయం తెలియగానే ఉన్నతాధికారుల సూచన మేరకు ముందుకెళ్లాం. ఓవైపు పులిని వాచ్ చేస్తూనే, మరోవైపు దానివైపు ప్రజలు వెళ్లకుండా అవగాహన కల్పించాం.

–కీర్తి, ఎఫ్ఎస్‌ఓ, కుంటాల

చాలా విషయాలు తెలుసుకున్నాం..



గతంలో ఇతర జంతువుల రక్షణకోసం పనిచేశాను. పెద్దపులి సరంక్షణ కోసం తొలిసారి విధినిర్వహణలో ఉన్నాను. పులికి సంబంధించి ప్రత్యక్షంగా చాలా విషయాలు తెలుసుకున్నాను. పాదముద్రల సేకరణ, కెమెరాలు పెట్టడం ఇలా ప్రతీపనిలో భాగమయ్యాం.

–స్వప్న, ఎఫ్‌బీఓ, కొట్ల(బి)

ఎటువెళ్తే.. అటువైపు..



పెద్దపులి ఒక్క దగ్గర ఉండనే ఉండదు. ఎప్పుడూ తిరుగుతూనే ఉంటుంది. మా బీట్ పరిధిలోకి వచ్చిన పులి మళ్లీ మహారాష్ట్రలోని అప్పారావుపేట్ వరకూ వెళ్లింది. మళ్లీ మా పరిధిలోకి వచ్చింది. ఇలా అది ఎటువెళ్తే అటు.. అడవుల్లోనే అధికారులతో కలిసి వెళ్లాం.

–శ్రీనివాస్, వాచర్, ఓలా

బృందంగా పనిచేస్తున్నాం..



జిల్లాలోకి పెద్దపులి అడుగుపెట్టినప్పటి నుంచి అడుగడుగునా వాచ్ చేస్తున్నాం. టైగర్‌ను కాపాడుకుంటూ.. అది సేఫ్‌గా వెళ్లేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఒక టీమ్‌గా మా అధికారులు, సిబ్బంది పగలురాత్రి అనే తేడా లేకుండా పనిచేస్తున్నారు.

–నాగినిభాను, డీఎఫ్‌వో

పులి సంరక్షణ కోసం..
పులుల సంరక్షణ కోసం హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ పనిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో తిరుగుతున్న పులి రక్షణ కోసం అటవీశాఖతో కలిసి పనిచేస్తున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తూనే.. అవగాహన కల్పించడంలో భాగమవుతున్నాం.

–మల్లేశ్, సొసైటీ ఫీల్డ్ అసిస్టెంట్

'మహా' ఎన్నికలపై మంత్రి నజర్!

- రెండు రోజులుగా ముధోల్‌లోనే 'పొంగులేటి'
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ముధోల్ నుంచే పర్యవేక్షిస్తున్న అమాత్యుడు



గెస్ట్‌హౌస్‌లో మంత్రి పొంగులేటితో విఠల్‌రెడ్డి

భైంసా: పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో ఉన్న నిర్మల్ జిల్లాలో ఎన్నికలవేడి కనిపిస్తోంది. ముధోల్, నిర్మల్ మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నాయి. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఇక్కడికి వచ్చారు. రెండు రోజులుగా మంత్రి ఇక్కడే మకాం వేశారు. శుక్ర, శనివారాల్లో ఇక్కడే గడిపారు. శనివారం సాయంత్రం ఈ గెస్ట్‌హౌస్ నుంచి నాందేడ్ బయలుదేరి వెళ్లారు. భైంసా మండలం కుంసర గ్రామ సమీపంలో ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో మంత్రి బసచేశారు. మహారాష్ట్ర ఎన్నికల పరిస్థితిని అంచనావేస్తున్నారు. అక్కడి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సరిహద్దులో ఎలా ప్రచారం చేయాలో సూచనలిస్తున్నారు.

సరిహద్దులో వేడి...
ఇప్పటికే ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ బీజేపీ అభ్యర్థి తరఫున బోకర్, ధర్మాబాద్ తాలుకాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం సరిహద్దు గ్రామం పాలజ్‌లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. బోకర్, బిలోలి, ధర్మాబాద్, కిన్వట్, నర్సి, నయాగావ్ తాలుకాల్లో సరిహద్దు గ్రామాల ప్రజలకు బంధుత్వాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి అక్కడ, అక్కడి నుంచి ఇక్కడ వ్యాపారంచేసే వారు ఎక్కువ. ముధోల్ నియోజకవర్గంలో తానూరు, కుభీర్, బాసర మండలాల్లోని చాలా గ్రామాల్లో మరాఠీయే అధికంగా మాట్లాడుతారు. దీంతో ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు అక్కడి బంధుత్వాలను ఓట్లుగా మలుచుకోవడంపై దృష్టిసారించారు. ఈ ప్రాంతంలోని మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, మండలస్థాయి నాయకులు మహారాష్ట్ర ప్రచారంలో కనిపిస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం..
మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. చంద్రపూర్, నాగ్‌పూర్‌తోపాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆదివారం సరిహద్దులోని ధర్మాబాద్, బిలోలి నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి ప్రచారం చేయనున్నారు. ఈనేపథ్యంలో ఇక్కడికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషిచేస్తున్నారు. మహారాష్ట్రలోని ముఖ్యనాయకులను కలిసి కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఐదు గ్యారంటీలతో అధికారంలోకిరావాలన్న పట్టుదలతో ఉన్నారు. ప్రైవేటు గెస్ట్‌హౌస్ నుంచే సరిహద్దులోని మహారాష్ట్రలో పోటీపడే కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులు, రైతు కూలీలను ఓట్లుగా మలుచుకునే విషయంపై దృష్టిసారించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలయ్యేలా చూస్తామని మహారాష్ట్ర ఓటర్లకు హామీ ఇస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, బోస్లే నారాయణరావుపటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్‌తో వేరువేరుగా భేటీ అయిన రాష్ట్ర మంత్రి మహారాష్ట్ర ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

తరలుతున్న ఓటర్లు...
మహారాష్ట్ర నుంచి వచ్చి ముధోల్ నియోజకవర్గంలోనే ఉన్న వారిని ఎన్నికల కోసం తరలిస్తున్నారు. ఈనెల 20న మహారాష్ట్రలో ఎన్నికలు జరుగనున్నాయి. భైంసా పట్టణంతోపాటు ముధోల్ నియోజకవర్గం వ్యాప్తంగా 10 వేలకుపైగానే ఓటర్లు ఉన్నారు. వారికి జిల్లాతోపాటు మహారాష్ట్రలోనూ ఓటు హక్కు ఉంది. దీంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇక్కడ ఉండే మహారాష్ట్ర వాసులను కలిసి పార్టీలకు ఓట్లువేయించుకునేలా పావులు కదుపుతున్నారు.

నేటి నుంచి గ్రూప్-3 పరీక్ష

- జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 8,124 మంది అభ్యర్థులు

నిర్మల్ రూరల్: టీజీపీఎస్సీ నిర్వహించే గ్రూప్–3 పరీక్షలు ఆది, సోమవారాల్లో జిల్లాలో జరగనున్నాయి. దీనికోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పేపర్ –1 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్– 2 పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు నిర్వహిస్తారు. దీనికోసం జిల్లా కేంద్రంలో మొత్తం 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8,124 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున 9:30 తర్వాత కేంద్రాల్లోకి ఎవరినీ అనుమతించరు. పరీక్షల నిర్వహణకు 24 మంది ముఖ్య పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, 24 మంది శాఖ అధికారులు, పది మంది ఫ్లయింగ్ స్క్వాడ్, 338 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 63 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష కేంద్రాలలోని పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేస్తారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆర్టీసీ భైంసా, ఖానాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

గ్రూప్-3కి ఏర్పాట్లు పూర్తి
నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్–3 పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో 8,124 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామని తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసే వరకు కేంద్రం నుంచి ఇన్విజిలేటర్లు, అభ్యర్థులు బయటకు రావొద్దని ఆదేశించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం

- ఆక్రమణకు గురైన భూములను వెనక్కి తీసుకుంటాం
- అటవీ భూహక్కుదారుల సమస్య పరిష్కరిస్తాం
- గుండెగాం పునరావాసానికి హామీ..

భైంసాటౌన్: ప్రభుత్వ భూముల పరిరక్షణలో ప్రభుత్వం వెనుకడుగు వేసేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసాకు వచ్చిన ఆయన రాత్రి మండలంలోని కుంసర గ్రామంలో బస చేశారు. శనివారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. జిల్లాలో గొలుసుకట్టు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, జిల్లాలో హైడ్రా అమలు చేయాలని పలువురు కోరారు. నీటి పారుదల, అటవీ, దేవాదాయ, వక్ఫ్ వంటి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. జిల్లాలో కొందరు పొజిషన్‌లో లేని భూములకు పత్రాలు సృష్టించి రైతుబంధు పొందినట్లు గుర్తించామని తెలిపారు. వాటిని 2014కు ముందు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత జాబితా ఆధారంగా పోల్చి చర్యలు తీసుకుంటామన్నారు.

- జిల్లాలో 103 హెక్టార్లలో గిరిజనులు, గిరిజనేతరుల అటవీ భూహక్కుదారులకు సంబంధించి సమస్యను కేబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, కడెం, జన్నారం, ఖానాపూర్ అటవీ ప్రాంతాలను కేంద్ర సహకారంతో పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.
- రానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో నూతన రెవెన్యూ చట్టం–2024 ఆమోదంపై కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. కొత్త చట్టంతోనే ధరణి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.



- డిసెంబర్‌లోగా రైతులకు పూర్తిస్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఇంకా రూ.13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉందని, ఇచ్చిన హామీ మేరకు మాఫీ చేస్తామన్నారు.
- బాసర ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లను తిరిగి మంజూరు చేసేందుకు కృషి చేస్తామని, భైంసా మండలం గుండెగాంవాసులకు తక్షణం పట్టణశివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని, లేదా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. పునరావాసం కోసం రూ.90 కోట్లు మంజూరు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరగాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరగాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లతో శనివారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. వరి కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రిపోర్టులను ఎప్పటికప్పుడు అందించాలని పేర్కొన్నారు. ప్రతీ రైతు ప్యాడీ క్లీనర్ల ద్వారా ధాన్యాన్ని శుభ్రం చేసి అమ్మేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనింగ్, తూకపు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని వివరించారు.



ముధోల్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..
అనంతరం రైస్ మిల్లర్లతో మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. ప్రతీ రైస్ మిల్లరు నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. తరుగు పేరుతో రైతుల నుంచి అధిక ధాన్యాన్ని సేకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో రాజమల్లు, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
ముధోల్: మండల కేంద్రం ముధోల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. అనంతరం వరి కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం మాయిశ్చర్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, డీఏఈవో అంజిప్రసాద్, ఏవో రచన, ఏఈవో సందేశ్, పీఏసీఎస్ సీవో సాయారెడ్డి ఉన్నారు.

అబ్దుల్లాపూర్‌లో సర్వే పునఃప్రారంభం

లోకేశ్వరం: వరి ధాన్యం తూకం వేయడం లేదని మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామస్తులు సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించారు. దీంతో గ్రామంలోని రైతులతో అధికారులు శనివారం సమావేశమయ్యారు. గ్రామస్తులకు నచ్చజెప్పారు. దీంతో సర్వేకు రైతులు అంగీకరించడంతో పునఃప్రారంభించారు. సర్వేను తప్పులు లేకుండా నిర్వహించాలని తహసీల్దార్ మోతీరాం సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీఈవో సోల మాన్‌రాజ్ పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభింపజేసిన మండల అధికారులు

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పెద్ద భీమయ్య మృతదేహం

దండేపల్లి: మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని కుంటలగూడ కట్టుకు చెందిన రైతు మార్నేని పెద్ద భీమయ్య (49) సోలార్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..పెద్ద భీమయ్య శనివారం తెల్లవా రుజాము తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం 7 గంటలు దాటిన ఇంటికి రాకపోవడంతో భార్య సత్తవ్వ అక్కడికి వెళ్లింది. సోలార్ వైరు వద్ద విద్యుత్ షాక్ తగిలి కాలిన గాయాలతో భీమయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తిర్యాణి: బైక్ అదుపుతప్పి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం..మండలంలోని మోర్రిగూడ గ్రామానికి చెందిన తిరుమల్‌రావు(42) శుక్రవారం రాత్రి పాత సమ్మక్క గద్దల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య సీతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్డి కట్టేమిషన్‌లో చేతులు ఇరుక్కుని గాయాలు

లోకేశ్వరం: గడ్డి కట్టేమిషన్‌లో రెండు చేతులు ఇరుక్కుని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజేష్‌తండాకు చెందిన రైతు రాథోడ్ మిథున్ శనివారం తన పొలంలో గడ్డికట్టలు కట్టేందు మిషన్‌ను తీసుకెళ్లాడు. గడ్డి కట్టలు కట్టేక్రమంలో దానికి అమర్చిన దారం తెగిపోయింది. సరిచేసే క్రమంలో మిథున్ చేతులు మిషన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి తాగిన వ్యక్తి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేవాపూర్‌కు చెందిన లొండే సందీప్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. ఈక్రమంలో సందీప్ మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు సందీప్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి దయబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బాసరలో ఉద్రిక్తత

- ట్రిపుల్‌ఐటీ ముట్టడికి ఏబీవీపీ పిలుపు
- భారీగా మోహరించిన జిల్లా పోలీసులు
- రైల్వేస్టేషన్, ఆలయంలో అరెస్టులు
- ట్రిపుల్‌ఐటీ గోడ దూకిన నాయకులు
- ఏఎస్పీ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్ వద్ద పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

భైంసా: బాసరలో శనివారం ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏబీవీపీ నాయకులు ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. ఇటీవల ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని పూరి స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనపై అక్కడికి వెళ్లిన నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడిచేశారు. ఇందులో సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడికి నిరసనగా ఏబీవీపీ నాయకులు ఇప్పటికే జిల్లాలో ఒకరోజు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. తాజాగా ట్రిపుల్‌ఐటీ ముట్టడికి నిర్ణయించారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారన్న సమాచారం ఇంటలిజెన్స్ అధికారులు చేరవేశారు. అప్రమత్తమైన ఎస్పీ జానకీషర్మిల..పోలీసులను మోహరించేలా చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

వేకువజాము అరెస్టులు

బాసర రైల్వేస్టేషన్‌లో ఉదయం 4 గంటల సమయంలో తాండూరు రైలుకు 50 మందికిపైగా ఏబీవీపీ నాయకులు దిగారు. స్టేషన్‌లో పోలీసు సిబ్బంది వారిని అదుపులో తీసుకున్నారు. ఏబీవీపీ చలో బాసర ట్రిపుల్‌ఐటీ ముట్టడికి తరలివచ్చే వారిని అదుపులో తీసుకునేందుకు ముందుగా ఆటోలను సిద్ధంగా ఉంచారు. వేకువజామున అరెస్టుల పరంపర కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రైళ్లలో బాసర స్టేషన్‌లో దిగిన వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న నాయకులను, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తాము వేరే పనిమీద వచ్చామని చెప్పినా వినిపించుకోలేదు. స్టేషన్‌లో ఏమి జరుగుతుందో విషయం తెలియక యాత్రికులు కొంత అయోమయానికి గురయ్యారు. తాండూరు, సంబాల్‌పూర్, నాందేడ్ ప్యాసింజర్ రైళ్లలో దిగిన యాత్రికులను తనిఖీలు చేశారు. కొందరు విద్యార్థులు బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడికి వెళ్లిన పోలీసులు వారిని లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించారు. బాసర అంతటా పోలీసులు మోహరించడంతో ఏమి జరుగుతుందోనని అంతా హైరానా పడ్డారు.

భారీ భద్రత..

బాసర ట్రిపుల్‌ఐటీలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఐడీకార్డులు ఉన్న విద్యార్థులనే లోనికి పంపించారు. అనుమానం ఉన్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అదుపులో తీసుకున్నారు. భైంసా, ముధోల్, కుంటాల, నిర్మల్, పెంబి, బాసర పోలీస్ స్టేషన్లకు విద్యార్థులను తరలించారు. బాసర క్యాంపస్‌లోకి కొత్తవారిని అనుమతించలేదు. ఎక్కడ యువకులు కనిపించిన పోలీసులు అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల.. ఎప్పటికప్పుడు భద్రతపై ఆరా తీశారు.

గోడ దూకి..

మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ గోడ దూకి లోనికి వెళ్లారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వచ్చేవారిని ముధోల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.


ఏబీవీపీ నాయకులను అదుపులో తీసుకుంటున్న పోలీసులు


రైల్వేస్టేషన్‌లో పోలీసులు


బాసరలో ఏబీవీపీ నాయకులను లాకెళ్తున్న పోలీసులు

పార్లమెంట్ హౌస్‌లో కళాకారుల ప్రదర్శన


రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌తో ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌కు చెందిన సకల కళా సంక్షేమ సంఘం ఆదివాసీ కళాకారులు శుక్రవారం రాత్రి ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రదర్శన చేశారు. గుస్సాడీ, డెంసా తదితర నృత్యాలు ప్రదర్శించారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలు కళాకారులను అభినందించారని సకల కళా సంక్షేమ డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఎంసీసీ కంపెనీకి చెందిన స్క్రాప్‌ను దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎంసీసీ కంపెనీకి చెందిన ఇనుపసామగ్రి(స్క్రాప్)ను దొంగిలించి బొలెరో వాహనంలో ర్యాలీ ఘడ్‌పూర్ వైపు తరలిస్తున్నారు. కంపెనీకి చెందిన పెట్రోలింగ్‌లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది శనివారం ఉదయం ఆపే ప్రయత్నం చేశారు. స్క్రాప్ దొంగలు కొంత దూరం వెళ్లాక వాహనాన్ని వదిలేసి పారిపోయారు. వాహనంలో క్వింటాల్ ఇనుప సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూగజీవాల వేటగాళ్లపై చర్యలు

- ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు

మందమర్రిరూరల్: మూగజీవాల వేటగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని సారంగపల్లి పంచాయతీ శివారు గల దుబ్బపల్లి అటవీప్రాంతంలో రెండు గేదెలు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైన విషయం తెలుసుకుని శనివారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వేటగాళ్లు మూగజీవాల కోసం సుమారు 600 మీటర్ల విద్యుత్ తీగలు అమర్చారని తెలిపారు. అనుమానం ఉన్న సండ్రోన్‌పల్లికి చెందిన ఐదుగురిని గుర్తించామన్నారు. వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయగా ఒకరిని అదుపులో తీసుకున్నామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్, ఎఫ్‌బీవో రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అటవీ ప్రాంతమంతా గాలింపు

చెన్నాపూర్ శివారులో పులి సంచరిస్తుందనే పుకారుతో శనివారం సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతమంతా గాలించినట్లు ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన పత్తి సేకరించడానికి వచ్చిన కూలీలకు ఏదో జంతువు కనబడితే దానినే పులిగా చెప్పుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు అటవీప్రాంతంలోకి వెళ్లొద్దన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే సమూహంతో వెళ్లాలని ఏదైనా పులి తిరిగినట్టు పాదముద్రలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గడ్డి వ్యాన్ దగ్ధం


దగ్ధమవుతున్న వ్యాన్

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి సమీపంలో గడ్డి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనకల్‌కు చెందిన డ్రైవర్ దుర్గం రవి శనివారం కవ్వాల్ నుంచి గడ్డి కొనుగోలు చేసుకుని వ్యాన్ లోడ్‌తో ఆదిలాబాద్ గోశాలకు వెళ్తున్నాడు. కామన్‌పల్లి నుంచి ప్రధాన కెనల్ మీదుగా కొంత దూరం వెళ్లగా 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు మధ్యలో ఉన్నాయి. కర్రతో పైకి లేపే క్రమంలో రెండు వైర్లు తగిలి గడ్డికి మంటలు అంటుకున్నాయి. గడ్డితోపాటు వ్యాన్ దగ్ధమైంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు బాగాలేకపోవడంతో అగ్నిమాపక వాహనం దూరంగా ఆపాల్సి వచ్చిందని ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న ఓ దాబా హోటల్ సమీపంలో 8.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సునీత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..శుక్రవారం జాతీయ రహదారి 44పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు రెండు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం తరలిస్తున్న నలుగురి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిమ్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

తాంసి: రిమ్స్ ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు అందించే వైద్యసేవలను పొన్నారి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో నూతనంగా చేరిన మెడికోల ఆధ్వర్యంలో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కార్యక్రమాన్ని డైరెక్టర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ విద్యవిల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతీ ఐదు కుటుంబాలకు ఒక వైద్యుడిని నియమించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సేవలు ఐదేళ్ల పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో మాజీసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రేఖ, వైద్యాధికారి శ్రావ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు


క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8 జిల్లాల నుంచి 8 జట్లు, 280 మంది క్రీడాకారులు, 16 మంది కోచ్‌లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సమత ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన్న, అన్నపూర్ణ, జమున, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

- మద్యంమత్తులో ఘర్షణ
- రిమ్స్ ఆస్పత్రికి తరలింపు


రిమ్స్‌లో వైద్యం పొందుతున్న మెస్రం బాలాజీ

నార్నూర్: మద్యంమత్తులో తండ్రికొడుకులు ఘర్షణ పడ్డారు. ఆవేశానికి లోనైన తండ్రి కత్తితో కొడుకుపై దాడి చేశాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మెస్రం భుజంగ్‌రావు, ఆయన కుమారుడు మెస్రం బాలాజీ వ్యవసాయం చేస్తుంటారు. తాగిన మైకంలో ప్రతీరోజు గొడవ పడుతుండేవారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత మద్యంమత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో భుజంగ్‌రావు కత్తితో బాలాజీని కడుపులో పొడిచాడు. తీవ్ర గాయం కావడంతో అతడిని కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ రహీంపాషాను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. కాగా, ఏ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందనే వివరాలు తెలియరాలేదు.

వృద్ధాశ్రమానికి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


వృద్ధుడిని తరలిస్తున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మందమర్రిరూరల్: 'అందరూ ఉన్నా..అనాథలా' శీర్షికన ఈనెల 13న సాక్షిలో ప్రచురితమైన కథనానికి శనివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్పందించారు. పట్టణానికి చెందిన వృద్ధుడు తిరుపతిరెడ్డి వద్దకు వెళ్లి వివరాలు సేకరించి మంచిర్యాలలోని వృద్ధాశ్రమానికి తరలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి అతన్ని వృద్ధాశ్రమానికి తరలించామని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజీమొద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పట్టణ అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, జావీద్‌పాషా, దిలీప్, చందు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..ముక్కెర రాజేశ్వర్‌గౌడ్ నివాసంలోని పై పోర్షన్‌లో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.10 వేల నగదు, ఐదు మద్యం బాటిళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదే కాలనీలోని కమటం రవీందర్, కొల్లూరి రాజు, రాపెల్లి రవి, ఆర్ విజయలక్ష్మి ఇళ్లల్లో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్‌టీంలతో కలిసి విచారణ చేపట్టారు. రాజేశ్వర్‌గౌడ్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా సెల్‌ఫోన్ చోరీ

భైంసాటౌన్: ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా చేస్తున్న రాంచందర్ శనివారం సాయంత్రం భైంసా–నిర్మల్ మార్గంలో ఖద్ర హోటల్ ప్రాంతంలో వాకింగ్ చేస్తూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగుడు ఫోన్ లాక్కుని పారిపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

వరికోతకు వేళాయె..!

- నన్నద్ధమవుతున్న రైతులు • వారంలో జోరందుకునే అవకాశం


కోతకు వచ్చిన వరిపంట

బెల్లంపల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపంట కోతకు సిద్ధమైంది. ప్రస్తుతం అక్కడక్కడ కోతలు ప్రారంభం కాగా, మరో వారంలో జోరందుకోనున్నాయి. ఇందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 7 మండలాలు, రెండు వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 60 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంట సాగైనట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. సీజన్ ప్రారంభంతోనే ఇతర ప్రాంతాల నుంచి హార్వెస్టర్లను లీజుకు తీసుకువచ్చి వరి కోతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తితీతకు వెళ్తున్న కూలీలు

వరి కోతలు రాకముందే కూలీలు గ్రామాల్లో పత్తితీత పనులకు వెళ్తున్నారు. కిలో చొప్పున లెక్కకట్టి కూలీ చెల్లిస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. వరి కోత పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఐదారేళ్ల నుంచి రైతులు హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా లీజుకు తీసుకువచ్చిన రైతులు హార్వెస్టర్ల అద్దె ధరకు ఏటా రూ.వందల్లో పెంచుతున్నారు. అద్దె ధర అధికమైనప్పటికీ హార్వెస్టర్లతో వరికోత పనులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీటి పనులు మొదలు కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొననుంది.

కూలీలు రావడం లేదు

వరి కోతలకు ఏటా కూలీల సమస్య ఏర్పడుతోంది. గ్రామాల్లో పత్తి తీత పనులు సాగుతున్నాయి. వరికోత పనులకు కూలీలకు రావడం లేదు. హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తుంది.

– గోమాస మల్లయ్య, రైతు, బెల్లంపల్లి మండలం

ఆర్టీసీ ప్రహరీ కూల్చివేత..!

- రోజులు గడుస్తున్నా పునరుద్ధరించని వైనం
- భైంసాలో అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు



ప్రహరీ కూల్చివేయడంతో ఏర్పడిన దారి



భైంసా బస్టాండ్ నుంచి ప్రైవేట్ వాహనాల వైపు వెళ్తున్న ప్రయాణికులు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీని ఓవైపు ఇటీవల రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. స్థానిక వినాయక్‌నగర్ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ ప్రహరీ నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించేలా కొద్దిభాగం మాత్రమే కూల్చివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఆర్టీసీ బస్టాండ్, వినాయక్‌నగర్‌ను ఆనుకుని మధ్యలో బస్టాండ్ ప్రహరీ ఉంది. ఇదే ప్రహరీని ఆనుకుని మరోవైపు ఆటోలు, జీపులు వంటి ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంటాయి. గతంలో ఇదేచోట ప్రహరీ కూల్చివేయడంతో ప్రయాణికులు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తూ వెళ్లిపోతున్నారనే ఉద్దేశంతో అప్పటి డీఎం ప్రహరీ మూసివేయించారు.

తాజా పరిణామాలపై అనుమానాలు..

ప్రహరీకి ఆవల వినాయక్‌నగర్‌లో పలు దుకాణాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ప్రహరీ మూసివేయడంతో బస్టాండ్ నుంచి ప్రయాణికులు ఇటువైపు వచ్చే మార్గం లేకపోవడంతో గిరాకీ తగ్గిందంటూ.. ప్రహరీ కొద్దిభాగం కూల్చి రాకపోకలకు అవకాశమివ్వాలని గత డీఎంను సంప్రదించారు. ఆమె ససేమిరా అనడంతో మిన్నకున్నట్లు సమాచారం. ఇపుడు తాజాగా ప్రహరీ కూల్చివేతకు గురి కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు చేశామన్న డీఎం..

ప్రహరీ కూల్చివేతపై డిపో మేనేజర్ హరిప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా దాదాపు పదిరోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ కూల్చివేశారని.. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ప్రహరీ పునరుద్ధరణపై అడుగగా.. బస్టాండ్ నుంచి వినాయక్ నగర్ వైపు రాకపోకలకు వీలుగా మెట్లు, గేట్ లాంటిది ఏర్పాటు చేస్తామని చెప్పడం గమనార్హం. ఇలా చేస్తే బస్టాండ్ నుంచి ప్రయాణికులు బయటకు వెళ్లి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తారని 'సాక్షి' ప్రశ్నించగా.. ఇప్పుడు మహాలక్ష్మి పథకం నేపథ్యంలో అలాంటి అవకాశం ఉండదని ప్రహరీ కూల్చివేతకు సమర్థించేలా జవాబు ఇవ్వడం గమనార్హం. ఇదే విషయం డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రహరీని పునరుద్ధరిస్తామని చెప్పారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భైంసారూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వానల్‌పాడ్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. నిర్ణీత తేమశాతం వచ్చిన పంటను తూకం వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులు, సిబ్బందిని ఆదేశించారు. ధాన్యంలో తప్ప, తాలు లేకుండా వేరు చేయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందని.. ఎవరూ ఆందోళన చెందవద్దని రైతులకు భరోసానిచ్చారు. వారి వెంట డీఎస్ఓ కిరణ్‌కుమార్, ఏఈఓ లక్ష్మి, రైతులు తదితరులు ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేయరూ..



పొట్టపెల్లిలో తీసిన గుంతలో భగీరథ జలం



రాచాపూర్ వద్ద కోతకు గురైన రోడ్డు

- పొలాల్లో చేరుతున్న నీరు
- పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పొట్టపెల్లి(కే) గ్రామ సమీపంలోని రాచాపూర్‌కు చెందిన పుట్టి చిన్నయ్య అనే రైతు పొలం వద్ద భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మూడు నెలల కిందట గుంత తవ్వి మరమ్మతులు చేశారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. భగీరథ అధికారులు సైతం తవ్విన పూడ్చడం మరిచారు. దీంతో సమీపంలోని వరి పొలాల్లోకి నీరు చేరడంతో పంట కోయడం కష్టంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. రాచాపూర్ గ్రామ సమీపంలో కెనాల్ వద్ద భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి రోడ్డు కోతకు గురైంది. రాత్రి రాకపోకలు సాగించే వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలను సరిచేసి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

24న పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు

నిర్మల్‌రూరల్: నిర్మల్ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారులు మ్యాడాజి శ్రీహరి, శ్రీరామోజు వెంకటస్వామి, దేవరకొండ రామతీర్థం తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 19, 20 తేదీల్లో నామినేషన్లు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వీకరిస్తామన్నారు. 21న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 24న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహించి.. మధ్యాహ్నం ఓట్లు లెక్కించి ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ముందాజి మారుతి, చిలమంతుల రాజలింగం, మూటపెల్లి బ్రహ్మయ్య, మంచిర్యాల పరమేశ్వర్, గాంధారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక అండ



చెక్కు అందిస్తున్న చైర్మన్ సుదర్శన్

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన అర్షియాబేగం, అబ్దుల్ సమీర్, అబ్దుల్ తన్వీర్, అబ్దుల్ జెహాన్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. ఈ విషయం తెలిసి స్పందించిన సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ శనివారం వారి భవిష్యత్ అవసరాల కోసం రూ.32వేల చెక్కును టీజీబీ బ్యాంకులో బాండ్ రూపంలోకి మార్చి అందజేశారు. ఏదైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిన్న రామయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసి, పలువురు నాయకులు రైస్ ఖాన్, రెహమత్ అలీ, ముత్యం, సాగర్, ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్‌రావు, పీఆర్వో క్రాంతి, సీఈఓ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సోన్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిద్దులకుంట ఉన్నత పాఠశాల హెచ్ఎం హరీశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో శిశు సంక్షేమశాఖ మహిళా సాధికారత కేంద్రం (మిషన్‌శక్తి) ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల సాధికారత, బాల్యవివాహాలు, లింగ వివక్షత-సమానత్వం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సఖీ సేవలు, చైల్డ్ సర్వీసెస్, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్టూడెంట్స్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ సవిత, జెండర్ స్పెషలిస్టులు మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హరినామ సప్తాహం



ప్రవచనాలు చెబుతున్న తుకారాం

తానూరు: కార్తికపౌర్ణమి సందర్భంగా మండలంలోని ఎల్వి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాల్యకీర్తనంలో నాందేడ్ జిల్లాకు చెందిన తుకారాం మహారాజ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చెడువ్యసనాలు వీడి భక్తిమార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు, ఆయా గ్రామాల భక్తులు తది తరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శుక్రవారం అర్ధరాత్రి ఉత్సవమూర్తుల ప్రతిమలతో రథోత్సవాన్ని పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం యజ్ఞపూర్ణహుతి, నాగవెల్లి, ఏకాంతోత్సవంతోపాటు పండితుల మహా దాశీర్వచనం తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణలో అభివృద్ధి శూన్యం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: గత బీఆర్ఎస్‌తోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాయగావ్ అసెంబ్లీ పరిధిలో పటోద(కె), పటోద(బి), శేల్గావ్, బాబ్లీ తదితర గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి రాజేశ్ సంభాజీ పవార్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను నమ్మవద్దని.. మోదీ నేతృత్వంలోని బీజేపీని ఆదరించాలని కోరారు. ఆయన వెంట మహారాష్ట్రతోపాటు పట్టణ బీజేపీ నాయకులు ఉన్నారు.

తానూరులో భక్తజన జాతర

- కుస్తీపోటీలు తిలకించేందుకు ఎగబడ్డ జనం



తలపడుతున్న మల్లయోధులు



కుస్తీ పోటీలు తిలకిస్తున్న జనం

తానూరు: మరో పండరీపురంగా భావించే తానూరు విఠలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు కార్తిక పౌర్ణమితో ముగిశాయి. శనివారం జాతర నిర్వహించగా సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆలయానికి తరలివచ్చి విఠల,రుక్మాబాయిస్వామివార్లకు ముడుపులు కట్టారు. తానూరు ప్రధాన రహదారి, పోలీస్‌స్టేషన్ ప్రాంతం, హైస్కూల్ ఆవరణ చిరు దుకాణాలతో నిండిపోయింది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథం లాగేందుకు పోటీపడ్డ జనం..

స్వామివారి రథయాత్ర వీధుల్లో సాగగా.. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో రథం లాగేందుకు జనం పోటీపడ్డారు. పూజల అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు...

శనివారం మధ్యాహ్నం విఠలేశ్వర ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామపెద్దలతో కలిసి కుస్తీపోటీలు ప్రారంభించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నాందేడ్, పర్భణి, బిలోలి, ముధ్‌ఖేడ్, పుణే, భోకర్, కిన్వట్ ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు మల్లయోధులు తరలివచ్చారు. విజేతకు రూ.11,111 నగదు, వెండి కడియం, ద్వితీయ స్థానంలో నిలిచిన మల్లయోధుడికి రూ.8,851తోపాటు వెండి కడియం బహుకరించి సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా శాంతియాగం



హాజరైన భక్తులు



అయోధ్య రామమందిరం నమూనా



మాట్లాడుతున్న స్వరూపానంద స్వామి

నిర్మల్‌టౌన్/సాక్షి ఫొటోగ్రాఫర్,నిర్మల్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఎదుట నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవ ఆయుత చండీ అతిరుద్ర మహాయాగం వైభవంగా కొనసాగుతోంది. లోకకల్యాణం కోసం ఈనెల 10న ప్రారంభమైన విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. శనివారం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపనంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమణ, లక్కాకుల నరహరి, పద్మాకర్ పాల్గొన్నారు. మంచిర్యాల చౌరస్తా నుంచి ఎస్పీ క్యాంపు కార్యాలయం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

కడెం: మండలంలోని మారుమూల గ్రామాలైన గంగాపూర్, దేవునిగూడెం, కొలాంగూడెంలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. పొగతాగడం, గుట్కా, తంబాకు తింటే, మద్యం సేవిస్తే కలిగే నష్టాలను వివరించారు. హెచ్‌ఈవో వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, ఎంఎల్‌హెచ్‌పీ బ్లేస్సీరత్న, శశికళ తదితరులున్నారు.

ఏరియాస్పత్రిలో పండ్లు పంపిణీ

భైంసాటౌన్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో బీజేపీ నాయకులు శనివారం రోగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, కౌన్సిలర్ గౌతం పింగ్లే, నాయకులు పోశెట్టి, కార్యకర్తలు ఉన్నారు.

సల్లగుంజ వేడుకలు



న్యూవెల్మల్‌లో గుంజ ఎక్కుతున్న యువత

సోన్: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో సల్లగుంజ వేడుకలు నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన సల్లగుంజ కార్యక్రమం ఆకట్టుకుంది. న్యూబొప్పారంలో రాచర్ల మహేశ్వర్, వెల్మల్‌లో ఆరే సాయితేజ సల్లగుంజ ఎక్కారు. అనంతరం మహా అన్నదానం చేశారు. వీడీసీ సభ్యులు తదితరులున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సట్టి సాయన్న

నిర్మల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సట్టి సాయన్న డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కమిటీ భవనం ఏర్పాటు చేసి దివ్యాంగులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఐకేపీ ద్వారా రుణాలు, నడవలేని వారికి పోస్టుమెన్ ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందించాలని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందులో రాష్ట్ర కోకన్వీనర్ ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యం, కోశాధికారి భగవాన్, క్రాంతికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



దస్తురాబాద్: ఆకొండపేటలో తేమశాతం పరిశీలిస్తున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ సోమ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోళ్లు వేగవంతం చేసి ఎప్పటికప్పుడు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆర్ఐ వేణుగోపాల్, నిర్వాహకుడు రవి పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట, దస్తురాబాద్, మున్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. తప్ప, తాలు లేకుండా పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు టోకెన్ అందించాలన్నారు. రైతులకు మంచినీరు, టెంట్ సౌకర్యం కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట ఆర్ఐ గంగన్న, గ్రామ సమైక్య సంఘ సభ్యులు, ఐకేపీ సీసీ రతిలాల్ తదితరులు ఉన్నారు.

వైద్యకళాశాలలో ఉద్యోగ అవకాశాలు

నిర్మల్: జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 52 ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దుర్గం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు దుర్గం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు www. nirmal. nic. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల18నుంచి 25వరకు కళాశాలలో అందజేయాలని సూచించారు. ల్యాబ్ అటెండెంట్-15 పోస్టులు, స్టోర్ కీపర్-01, డాటా ఎంట్రీఆపరేటర్-02, స్టెనో-01, టైపిస్ట్-01, రికార్డ్‌అసిస్టెంట్-01, రికార్డు క్లర్కు-01, రేడియోగ్రఫీ టెక్నీషియన్-03, రేడియోగ్రఫీ టెక్నీషియన్ ఈసీజీ-02, రేడియోగ్రఫీ టెక్నీషియన్ సిటీస్కాన్-03, అనస్తీషియా టెక్నీషియన్-04, ధోబీ-04, ఎలక్ట్రీషియన్-02, ప్లంబర్-01, డ్రైవర్-01, థియేటర్ అసిస్టెంట్-04, గ్యాస్ ఆపరేటర్-02, వార్డుఅటెండెంట్-04 పోస్టులున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 78422 82218, 99481 70670, 80740 44154 నెంబర్లను సంప్రదించాలని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని.. పోస్టులు ఇప్పిస్తామని చెప్పే మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని దుర్గం శేఖర్ సూచించారు.

'మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం'

కుంటాల: మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఎమ్మెల్సీ, తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. శనివారం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్తూ కుంటాలలో ఆగి హైకోర్టు న్యాయవాది జక్కుల గజేందర్ వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పలువురు సెల్ఫీలు దిగారు.

సంక్షిప్త వార్తలు

బీమా చెక్కు అందజేత

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి.. రైతు కుటుంబానికి రూ.2లక్షల చెక్కును శనివారం అందజేశారు. సంఘంలో సభ్యుడిగా ఉన్న కాల్వతండా గ్రామానికి చెందిన రైతు జాదవ్ శివలాల్ ఇటీవల మృతి చెందాడు. అతడి పేరిట మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును శివలాల్ భార్య విమలాబాయికి అందించారు. పీఏసీఎస్ డైరెక్టర్ జె.లక్ష్మణ్, బ్యాంకు మేనేజర్ శిరీష్‌గౌడ్, సూపర్‌వైజర్ బి.సునిల్, సీఈవో సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కాకడ హారతి

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి మందిరంలో నెలరోజులుగా కొనసాగిన కాకడ హారతి శనివారం ముగిసింది. చివరిరోజు పూజల అనంతరం, మధ్యాహ్నం పట్ల పండుగ నిర్వహించారు. శ్రీకృష్ణుడి వేషధారణలో బాలుడు ఉట్టి కొట్టాడు. ఏడు రోజులు విఠల్ మహారాజ్ భక్తులకు పురాణం వివరించారు.

20న వాహన వేలం

ముధోల్: మండలకేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వాహనానికి ఈనెల 20న వేలంపాట నిర్వహించనున్నట్లు సీడీపీవో సరోజన ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు ఏపీ1ఉ3504, ఇంజిన్ నెంబర్ డీపీ13367 కల్గిన వాహనాన్ని వేలం వేస్తామని.. ఆసక్తి కల్గినవారు బుధవారం ఉదయం 11 గంటలకు కార్యాలయానికి రావాలని కోరారు.

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

కడెం: ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఈజీఎస్ సోషల్ ఆడిట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అధికారులకు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. సర్వే వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

సోన్: బాసర ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తారనే ముందస్తు సమాచారంతో మండలంలోని బీజేపీ నాయకులను సోన్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవడమే ఆత్మహత్యలకు కారణమని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో ముత్కపల్లి నరేశ్, దావ సాయన్న, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

బాలల దినోత్సవం

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో శనివారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రాధిక, జేవీపీ స్వరూప, సిబ్బంది తదితరులు ఉన్నారు.